# 1. శకుంతలోపాఖ్యానము

## కవిపరిచయాదులు

కవి : నన్నయ భట్టారకుడు

కాలము : క్రీ.శ. 11వ శతాబ్దము

రాజమహేంద్రవరము రాజధానిగా తూర్పు చాళుక్య సామ్రాజ్యము నేలిన వేంగి ప్రభువు రాజరాజనరేంద్రుని (1023-1063) ఆస్థానకవి, కుల బ్రాహ్మణుడు నన్నయ. ఆదికవి, వాగనుశాసనుడు / శబ్దశాసనుడు అనేవి నన్నయ బిరుదులు. రాఘవాభ్యుదయము, ఇంద్రవిజయము, చాముండికావిలాసము, ఆంధ్రశబ్ద చింతామణి అను వ్యాకరణ గ్రంథము, లక్షణ సారమను ఛందోగ్రంథాలను రచించెను నన్నయ ఆంధ్రమహాభారతము నందు ఆది సభాపర్వములు, అరణ్య పర్వమునందు నాల్గవ ఆశ్వాసములో 142వ పద్యము వరకు ఆంధ్రీకరించెను.

"ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వము అనేవి నన్నయ కవితా రీతులు. అవి ఈ క్రింద పద్యంలో చూడవచ్చు.

సారమతిం గవీంద్రులు ప్రసన్నకథా కలితార్థయుక్తిలో
నారసి మేలు నానితరు లక్షర రమ్యత నాదరింప నా
నా రుచిరార్థ సూక్తినిధి నన్నయభట్టు తెలుంగునన్ మహా
భారత సంహితా రచన బంధురుడయ్యె జగద్ధితంబుగన్

## పాఠ్యభాగ సందర్భము

శకుంతల మేనకా విశ్వామిత్రులకు జన్మించిన కుమార్తె. పుట్టిన కొలది కాలమునకే తల్లిదండ్రులు ఆమెను వీడివెడలిపోగా - పక్షులే తమ రెక్కలను కప్పి ఆ బాలకను కాపాడెను. శకుంతమనగా పక్షి - పక్షులచేత సంరక్షింపబడెను కావున ఆ బాలికకు "శకుంతల" అని నామకరణము చేసి, కణ్వ మహర్షి తన ఆశ్రమములో ఆమెను పెంచి పెద్దచేసెను.

కొలది కాలమునకు దుష్యంత మహారాజు వేటకై వనమునకు వచ్చెను. భీకర మృగాలను వేటాడి బాగుగా అలసిపోయి, మునిని దర్శింప వేడుకతో కణ్వుని ఆశ్రమమునకు వెడలెను. అచట అపూర్వ సౌందర్యరాశియైన శకుంతలనున గాంచి మోహించెను.

శకుంతల ద్వారా ఆమె జన్మవృత్తాంతమును విని - క్షత్రియకాంతగా తెలిసికొని దుష్యంతుడు తనను వివాహమాడి సకల రాజసౌఖ్యముల ననుభవింపుమని కోరెను. శకుంతల తన తండ్రి వచ్చిన పిదప - ఆయన అనుమతితో వివాహమాడవచ్చునని సమాధానమిచ్చెను. అంత "నీ ప్రసాదమున నాకు జన్మించిన కుమారుని యౌవరాజ్యమనకు అభిషిక్తుని కావింపవలెనని" శకుంతల కోరెను. అందులకు అంగీకరించి దుష్యంతుడు శకుంతలను 'గాంధర్వ వివాహము' చేసుకొని అనంత సుఖములను అనుభవించెను.

ఆమెను రాజధానికి తీసికొని వచ్చుటకై ప్రధాన వర్గమును పంపెదనని పలికి దుష్యంతుడు వెడలిపోయెను. ఇంతలో కణ్వమహర్షి వచ్చి, తండ్రి కోపించునేమోయని శకుంతల భయపడుచుండగా, తన యోగదృష్టి చేత జరిగిన వృత్తాంతమంతయు గ్రహించి - "తల్లీ ! నీ కులగోత్ర సౌందర్యములకు తగిన భర్తనే పొందితివి. నీ గర్భమునందున్నవాడు సకల భూమండలము నేలు చక్రవర్తి యగును" అని ఆశీర్వదించెను. తరువాత శకుంతల రాజలక్షణ లక్షితుడైన ఒక కుమారుని గనెను. సంవత్సరములు గడచినను రాజభటుల జాడలేదు. కుమారుడు యుక్తవయస్కుడగుచున్నాడు. ఈ సన్నివేశముతో పాఠ్యభాగము ఆరంభమగుచున్నది.



Scanned with CamScanner

## ప్రతిపదార్థ తాత్పర్యములు

1\. తలపగ నాడు పల్కిన విధం బెడదప్పగ నీడెనొక్కొ చూ
ద్కులు విరసంబులై కరము క్రూరములైన నిమిత్త మేమియో
కలయగ బల్కరించి రుపకారులు నైరని నమ్మి యుండగా
వలవదు బుద్ధిమంతులు నవ ప్రియులైన ధరాధినాధులన్

**కవిపరిచయం :** ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారతము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

**సందర్భము :** శకుంతల తన కుమారునితో దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన పిమ్మట గతములో తనపై చూపిన ప్రేమానురాగము చూపించని సన్నివేశంలో శకుంతల బాధపడుచున్న సందర్భములోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| తలపగన్ | : | ఆలోచించి చూడగా |
| నాడు | : | కణ్వాశ్రమంలో ఆ రోజున |
| పల్కిన | : | మాటలాడిన |
| విధంబున్ | : | తీరును (విధమును) |
| తప్పన్ | : | వీడవలెనని |
| ఎడన్ | : | మనస్సునందు |
| తలంచెన్ + ఒక్కొ | : | దుష్యంతుడు భావిస్తున్నాడా? |
| చూడ్కులు | : | చూపులు |
| విరసంబులు + ఐ | : | అనురాగము లేనివై |
| కరము | : | మిక్కిలి |
| క్రూరములు | : | కఠినములు |
| ఐన | : | అగుటకు |
| నిమిత్తము | : | కారణము |
| ఏమియో | : | ఏమై ఉంటుంది? |
| కలయగన్ | : | చక్కగా (కలుపుగోలు తనంగా) |
| పల్కరించిరి | : | మాట్లాడారు కదా అని, |
| ఉపకారులు | : | సహాయముచేసిన వారు |
| ఐరి + అని | : | అయ్యారుకదా అని |
| నవప్రియులు + ఐన | : | క్రొత్తవారి యందు ప్రీతిగలవారైన |
| ధర + అధినాథులన్ | : | రాజులను |
| బుద్ధిమంతులు | : | వివేకవంతులైన వారు |
| నమ్మి + ఉండగాన్ + వలవదు | : | నమ్మరాదు. |



Scanned with CamScanner

**తాత్పర్యము :** ఆలోచించి చూడగా కణ్వాశ్రమంలో ఆ రోజున మాటలాడిన పద్ధతిని వీడవలెనని మనస్సునందు దుష్యంతుడు భావిస్తున్నాడా? చూపులు అనురాగము లేనివై మిక్కిలి కఠినములు అగుటకు కారణము ఏమై ఉంటుంది? చక్కగా (కలుపుగోలు తనంగా) మాట్లాడారు కదా అని, సహాయముచేసిన వారు అయ్యారుకదా అని కొత్తవారి యందు ప్రీతిగలవారైన రాజులను వివేకవంతులైన వారు నమ్మరాదు.

**వ్యాఖ్య :** శకుంతల తన కుమారునితో దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన పిమ్మట గతములో తనపై చూపిన ప్రేమానురాగము చూపించని సన్నివేశాన్ని ఆదికవి నన్నయ్య వర్ణించిన తీరు చంపకమాల వృత్తపద్యమై ఒలరారుచున్నది.

2. విమల యశోనిధీ పురుషవృత్తమెఱుంగుచు నుండు జూవె వే
దములను బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముదును జంద్రసూర్యులు నహంబును రాత్రియు నన్మహాపదా
ర్థము లివి యుండగా నరుడు దక్కొన నేర్చునె తన్ను బ్రముచ్చిలన్

**కవి పరిచయం :** ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారతము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

**సందర్భము :** శకుంతల తన కుమారుని తోడ్కొని దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన పిమ్మట గతములో తనపై చూపిన అనురాగము చూపించని సన్నివేశంలో శకుంతల దుష్యంతునికి ధర్మప్రబోధం చేస్తున్న సందర్భంలోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| విమల | : | నిర్మలమైన |
| యశః + నిధీ | : | కీర్తికి నిధివంటివాడా! ఓ దుష్యంత మహారాజా! |
| వేదములును | : | ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము అను నాలుగు వేదములును |
| పంచ భూతములు | : | భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశము అనెడి పంచభూతములు |
| ధర్మువున్ | : | ధర్మమును |
| సంధ్యలున్ | : | ఉభయ సంధ్యలును (ప్రాత: సంధ్య, సాయం సంధ్య) |
| అంతరాత్మయున్ | : | మనస్సును (అంతరాత్మయును) |
| యముదును | : | యమధర్మరాజును |
| చంద్ర సూర్యులున్ | : | సూర్య చంద్రులును |
| అహంబును | : | పగలును |
| రాత్రియున్ | : | రాత్రియును |
| అన్ | : | అనెడి |
| మహా పదార్థములు | : | గొప్ప పదార్థములు |
| పురుష వృత్తమున్ | : | మానవుల నడవడికను |
| ఎఱుంగుచున్ | : | గమనిస్తూనే |

| | | |
|---|---|---|
| ఉండున్ + చూవె | : | ఉంటాయి సుమా! |
| ఇవి + ఉండగాన్ | : | ఈ మహా పదార్థములు ఉండగా |
| నరుడు | : | మానవుడు |
| తన్నున్ | : | తనను |
| మ్రుచ్చిలన్ | : | వంచించుకొనుటకు |
| తక్కొనన్ + నేర్చునే | : | ప్రయత్నించగలడా! (ప్రయత్నించలేడని భావము) |

తాత్పర్యము : నిర్మలమైన కీర్తికి నిధివంటివాడా! ఓ దుష్యంత మహారాజా! ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము, అధర్వణ వేదము అను నాలుగు వేదములును, భూమి, గాలి, నీరు, అగ్ని, ఆకాశము అనెడి పంచభూతములు, ధర్మమును, ఉభయ సంధ్యలును (ప్రాత: సంధ్య, సాయం సంధ్య), మనస్సును (అంతరాత్మయును), యమధర్మరాజును, సూర్య చంద్రులును, పగలును, రాత్రియును, అనెడి గొప్ప పదార్థములు మానవుల నడవడికను గమనిస్తూనే ఉంటాయి సుమా! ఈ మహాపదార్థములు ఉండగా మానవుడు తనను వంచించుకొనుటకు ప్రయత్నించ గలడా? ప్రయత్నించ లేడని భావము.

వ్యాఖ్య: దుష్యంతుని కొలువు నకు వచ్చిన శకుంతలను నిరాకరించిన నేపథ్యంలో శకుంతల ధర్మబద్ధులైన రాజుల ప్రవర్తనను నిరసిస్తూ ఆత్మవంచన సరికాదని తెలుపుచున్న సందర్భము చంపకమాల వృత్తపద్యమై తులతూగుచున్నది.

3. విపరీత ప్రతిభాషలేమిటికి నుర్వీనాథ యీ పుత్రగా
త్ర పరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగ ప్రసరంబు జందనము జంద్రజ్యోత్స్నయుం బుత్త్రగా
త్ర పరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే.

కవి పరిచయం : ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారతము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

సందర్భము : శకుంతల తన కుమారుని తోడ్కొని దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన శకుంతలను నిరాకరించిన నేపథ్యంలో పుత్రుని కౌగిలింతవల్ల తండ్రి పొందే సుఖాన్ని గూర్చి తెలియచేస్తున్న సందర్భములోనిది.

ప్రతిపదార్థము :

| | | |
|---|---|---|
| ఉర్వీనాథ! | : | ఓ దుష్యంత మహారాజా! |
| విపరీత | : | విరుద్ధములైన |
| ప్రతిభాషలు | : | మాటలు |
| ఏమిటికి | : | ఎందులకు? |
| ఈ పుత్ర | : | ఈ నీ కుమారుని |
| గాత్ర | : | శరీరముయొక్క |
| పరిష్వంగ | : | ఆలింగనము వలన కలుగు (కౌగిలింతవలన కలుగు) |
| సుఖంబున్ | : | ఆనందమును |
| చేకొనుము | : | పొందుము. |
| ముక్తాహార | : | ముత్యాల హారము |



Scanned with CamScanner

| | | |
|---|---|---|
| కర్పూర | : | కర్పూరము |
| సాంద్ర | : | దట్టమైన |
| పరాగ | : | పుప్పొడి రేణువుల |
| ప్రసరంబున్ | : | వ్యాప్తి |
| చందనమున్ | : | మంచి గంధము |
| చంద్రజ్యోత్స్నయున్ | : | చంద్రుని వెన్నెల |
| పుత్రగాత్ర | : | కుమారుని శరీరము |
| పరిష్వంగమున్ + అట్లు | : | కౌగిలింతవల్ల పొందే హాయిని |
| జీవులకున్ | : | మనుషులకు |
| హృద్యంబే | : | మనోహరమును |
| కడున్ శీతమే | : | మిక్కిలి చల్లదనాన్ని కల్గిస్తాయా? (కల్గించవని భావము) |

**తాత్పర్యము :** ఓ దుష్యంత మహారాజా! విరుద్ధములైన మాటలు ఎందులకు? ఈ నీ కుమారుని శరీరముయొక్క ఆలింగనము వలన కలుగు (కౌగిలింతవలన కలుగు) ఆనందమును పొందుము. ముత్యాల హారము కర్పూరము దట్టమైన పుప్పొడి రేణువుల వ్యాప్తి మంచి గంధము చంద్రుని వెన్నెల కుమారుని శరీరము కౌగిలింతవల్ల పొందే హాయిని మనుషులకు మనోహరమును మిక్కిలి చల్లదనాన్ని కల్గిస్తాయా? (కల్గించవని భావము)

**వ్యాఖ్య:** దుష్యంతుని ఆస్థానానికి వచ్చిన శకుంతలను నిరాకరించిన నేపథ్యంలో కన్నతండ్రి కుమారుని ఆలింగనం చేసుకొనుట వల్ల పొందేసుఖం మరి వేటివల్ల కూడా రావని తెలియచేస్తున్న నేపథ్యాన్ని ఆదికవి నన్నయ మత్తేభ విక్రీడిత పద్యంలో అందముగా అభివర్ణించారు.

4. నుతజలపూరితంబు లగు నూతులు నూటిదికంటె సూనృత
వ్రత యొక బావిమేలు మఱి బావులు నూటిదికంటె నొక్కసం
క్రతు వది మేలు తత్క్రతుశతంబున కంటె సుతుండు మేలు త
త్సుత శతకంబు కంటె నొక సూనృత వాక్యము మేలు సూడగన్

**కవి పరిచయం :** ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

**సందర్భము :** శకుంతల తన కుమారుని తోడ్కొని దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన శకుంతలను నిరాకరించిన నేపథ్యంలో సత్యవాక్కుయొక్క గొప్పతనాన్ని తెలిచేస్తున్న సందర్భములోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| సూనృత వ్రత | : | సత్యవాక్పాలకుడవైన ఓ రాజా! |
| నుతజల | : | మంచి నీటితో |
| పూరితంబులు | : | నిండియున్న వగు |
| నూతులు | : | చేదుడు బావులు |
| నూటిటి కంటెన్ | : | వంద కంటెను |
| ఒక బావి | : | ఒక దిగుడు బావి |

| | | |
|---|---|---|
| మేలు | : | శ్రేష్ఠమైనది |
| మఱి | : | మరియును |
| బావులు నూఱిటి కంటెన్ | : | అట్టి వంద దిగుడు బావుల కంటె |
| ఒక్క సత్+క్రతువు+అది | : | ఒక మంచి యజ్ఞము (లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞము) |
| మేలు | : | శ్రేష్ఠమైనది |
| త్ + క్రతు | : | అట్టి యజ్ఞములు |
| శతంబున కంటెన్ | : | నూరిటి కంటెను |
| సుతుండు | : | కుమారుడు |
| మేలు | : | శ్రేష్ఠము. |
| చూడగన్ | : | పరిశీలింపగా |
| తత్ + సుత | : | అటువంటి కుమారులు |
| శతకంబు కంటెన్ | : | వంద మంది కంటె |
| ఒక సూనృత వాక్యము | : | ఒక సత్యవాక్యము |
| మేలు | : | ఎంతో ఉత్తమమైనది. |

**తాత్పర్యము :** సత్యవాక్పాలకుడవైన ఓ రాజా! మంచి నీటితో నిండియున్న వగు చేదుడు బావులు వంద కంటెను ఒక దిగుడు బావి శ్రేష్ఠమైనది మరియును అట్టి వంద దిగుడు బావుల కంటె ఒక మంచి యజ్ఞము (లోక కళ్యాణం కోసం చేసే యజ్ఞము) శ్రేష్ఠమైనది అట్టి యజ్ఞములు నూరిటి కంటెను కుమారుడు శ్రేష్ఠము. పరిశీలింపగా అటువంటి కుమారులు వంద మంది కంటె ఒక సత్యవాక్యము ఎంతో ఉత్తమమైనది.

**వ్యాఖ్య:** దుష్యంతుని కొలువునకు వచ్చిన శకుంతల సత్యవాక్కు యొక్క గొప్పతనాన్ని చాటిచెబుతున్న నేపథ్యం చంపకమాల వృత్తపద్యమై ఒలరారుచూ నన్నయ కవితా రీతులలో నానా రుచిరార్థ సూక్తినిధిత్వానికి ప్రతీకగా నిలుస్తుంది.

5. తడయక పుట్టిననాడ తల్లిచే దంద్రిచే విడువ
బడితి నిప్పుడు పతిచేతను విడువబడియెదనాక్కొ
నుడువులు వేయు నిం కేల యిప్పాటినోములు దొల్లి
కడగి నోచితిని గా కేమి యనుచును గందె డెందమున

**కవి పరిచయం :** ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

**సందర్భము :** తన కుమారుని తోడ్కొని దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన శకుంతల బాధాతప్త హృదయంతో తన గత జీవితాన్ని గురించి తలచుకొని చింతిస్తున్న సందర్భములోనిది.

**ప్రతిపదార్థము :**

| | | |
|---|---|---|
| పుట్టిన నాడ | : | నేను పుట్టిన రోజుననే |
| తడయక | : | వెంటనే (ఆలస్యము చేయకుండా) |
| తల్లిచేన్ | : | తల్లియగు మేనక చేతను |



Scanned with CamScanner

| | | |
|---|---|---|
| తండ్రి చేన్ | : | తండ్రియగు విశ్వామిత్రుని చేతను |
| విడువన్ + పడితిని | : | విడిచిపెట్ట బడితిని. |
| ఇప్పుడు | : | ఈ సమయమున (వివాహమైన పిదప) |
| పతి చేతను | : | భర్తయగు దుష్యంతుని చేతకూడ |
| విడువన్ + పడియెదన్ + ఒక్కొ | : | విడిచిపెట్టబడుచుంటిని కాబోలు |
| వేయున్ | : | వేయి (పెక్కు) |
| నుడువులు | : | మాటలు |
| ఇంకన్ + ఏల | : | యింకను ఎందులకు |
| కడగి | : | పూనుకొని |
| ఈ + పాటి | : | ఈ విధమైన |
| నోములు | : | వ్రతములు |
| తొల్లి | : | పూర్వ జన్మమునందు |
| నోచితిని | : | నోచియుంటిని |
| కాక + ఏమి | : | ఇట్లుకాక మరేమగును ? |
| అనుచున్ | : | అనుకొనుచు |
| డెందమునన్ | : | మనస్సులో |
| కందెన్ | : | మిక్కిలిగా బాధపడెను. |

**తాత్పర్యము :** నేను పుట్టిన రోజుననే వెంటనే (ఆలస్యము చేయకుండా) తల్లియగు మేనక చేతను తండ్రియగు విశ్వామిత్రుని చేతను విడిచిపెట్ట బడితిని. ఈ సమయమున (వివాహమైన పిదప) భర్తయగు దుష్యంతుని చేతకూడ విడిచిపెట్టబడుచుంటిని కాబోలు వేయి (పెక్కు) మాటలు యింకను ఎందులకు? పూనుకొని ఈ విధమైన వ్రతములు పూర్వ జన్మమునందు నోచియుంటిని కాబోలు. ఇట్లుకాక మరేమగును? అనుకొనుచు మనస్సులో మిక్కిలిగా బాధపడెను.

**వ్యాఖ్య:** తన కుమారుని తోడ్కొని దుష్యంత మహారాజు కొలువుకు వచ్చిన శకుంతల బాధాతప్త హృదయాన్ని కన్నులకు గట్టినట్లు మధ్యాక్కర పద్యంలో మలిచిన ఆదికవి నన్నయ భట్టు పాండితీ ప్రతిభకు తార్కాణం ఈ పద్యం.

6. గొనకొని వీడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు సే
కొని భరియింపు మీతని శకుంతల సత్యవు వల్కె సాధ్వి స
ద్వినుత మహాపతివ్రత వివేకముతో నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందగ దత్సభాసదుల్

**కవి పరిచయం :** ఈ పద్యరత్నము నన్నయ భట్టుచే అనువదించబడిన ఆంధ్రమహాభారము, ఆదిపర్వము, చతుర్థాశ్వాసము నుండి గ్రహించబడిన "శకుంతలోపాఖ్యానము" అను ప్రాచీన పద్యభాగములోనిది.

**సందర్భము :** దుష్యంత మహారాజు భార్యగా నిరాకరించబడిన పతివ్రతా శిరోమణి అయిన శకుంతల కంటతడి పెట్టుచు విగతయై కుమారుని తోడ్కొని వెనుదిరిగి పోనున్న సందర్భంలో అశరీరవాణి పలుకుతున్న సందర్భం ఈ పద్య పరిమళం.



Scanned with CamScanner

దార్థము :

| | | |
|---|---|---|
| దివ్యవాణి | : | అశరీర వాణి |
| తత్ + సభాసదుల్ | : | ఆ సభలో నున్నవారు |
| విస్మయము | : | ఆశ్చర్యము |
| అందగన్ | : | పొందగా |
| గానకాని | : | ఒప్పుగా |
| వీడు | : | ఈ బాలుడు |
| నీకున్ | : | నీకును (దుష్యంతునకు) |
| శకుంతలకున్ | : | శకుంతలకును |
| ప్రియనందనుండు | : | ప్రీతిపాత్రుడైన కుమారుడు |
| ఈతనిన్ | : | ఈ నీ కుమారుని |
| చేకొని | : | స్వీకరించి |
| భరియింపుము | : | పోషింపుము |
| శకుంతల | : | శకుంతల |
| సాధ్వి | : | సాధు శీలము కలది |
| సత్ + వినుత (సద్వినుత) | : | సజ్జనులచేత పొగడబడినది |
| మహా పతివ్రత | : | గొప్ప పతివ్రత |
| వివేకముతో | : | జ్ఞానముతో |
| సత్యము | : | సత్యమును |
| పల్కెన్ | : | పలికినది |
| అని | : | అని |
| తాన్ | : | స్వయముగా |
| ధర + అధినాధునకున్ | : | మహారాజగు దుష్యంతునకు |
| వినిచెన్ | : | చెప్పెను |

తాత్పర్యము : అశరీర వాణి, ఆ సభలో నున్నవారు ఆశ్చర్యము పొందగా ఇట్లుపలికెను. ఒప్పుగా ఈ బాలుడు నీకును (దుష్యంతునకు), శకుంతలకును ప్రీతిపాత్రుడైన కుమారుడు. ఈ నీ కుమారుని స్వీకరించి పోషింపుము. శకుంతల సాధుశీలము కలది. సజ్జనులచేత పొగడబడినది. గొప్ప పతివ్రత. జ్ఞానముతో సత్యమును పలికినది అని స్వయముగా మహారాజగు దుష్యంతునకు చెప్పెను.

వ్యాఖ్య: దుష్యంత మహారాజు శకుతల, భరతులను స్వీకరించుటకు ఈ దివ్యవాణి మాటలే ఆధారం అయ్యాయన్నదే ఇక్కడ చెప్పదగిన అంశం. ఈ పద్యం చంపకమాల వృత్తపద్యములో మలచిన తీరు నన్నయ పాండిత్యానికి ప్రతీక.

## వ్యాసరూప ప్రశ్నలు

**1. శకుంతలోపాఖ్యానము పాఠ్యభాగ సారాంశం విశదీకరించండి. (లేదా)**

**2. శకుంతలోపాఖ్యానము పాఠ్యభాగమాధారంగా సత్యవాక్కు గొప్పతనాన్ని తెలియజేయండి. (లేదా)**

**3. దుష్యంతుడు నిండు కొలువులో శకుంతలను నిరాకరించిన విధము తెల్పండి. (లేదా)**

**4. శకుంతల చేసిన ధర్మప్రబోధాన్ని కుటుంబ పవిత్రానుబంధాన్ని చర్చించండి.**

**జ) కవిపరిచయం :** నన్నయభట్టు క్రీ. శ.11వ శతాబ్దమువాడు. ఈతడు తూర్పు చాళుక్య ప్రభువైన రాజరాజనరేంద్రుని (1023–1063) ఆస్థానకవి, కుల బ్రాహ్మణుడు. ఈయనకు ఆదికవి, వాగనువసనుడు/శబ్దశాసనుడు అను బిరుదులు కలవు. నన్నయ రాఘవాభ్యుదయము, ఇంద్రవిజయము, చాముండికావిలాసము, ఆంధ్రశబ్ద చింతామణి అను వ్యాకరణ గ్రంథము, లక్షణ సారమను ఛందోగ్రంథాలను రచించెను నన్నయ ఆంధ్రమహాభారతము నందు ఆది సభాపర్వములు, అరణ్య పర్వమునందు నాల్గవ ఆశ్వాసములో 142వ పద్యము వరకు ఆంధ్రీకరించెను. "ప్రసన్న కథా కలితార్థయుక్తి, అక్షరరమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వము అనేవి నన్నయ కవితా రీతులు.

శకుంతల కుమారుడు అరణ్యములో ఉన్న జంతువులను తన బలాధిక్యంతో శిక్షించుటను గమనించిన మునులు అతనికి "సర్వదమనుడు" అను పేరు పెట్టిరి. కణ్వమహర్షి కూడా ఆ పిల్లవాని తేజస్సును, పరాక్రమమును చూసి వీడు సమస్త భూమండలమునకు యౌవరాజ్యపట్టాభిషిక్తుడగుటకు తగిన సమయం వచ్చెనని భావించి పెంపుడు కుమార్తె యగు శకుంతలతో యిట్లు పల్కెను.

స్త్రీలకు భర్తయే సమస్తము కావున భార్య భర్తదగ్గర ఉండుటయే న్యాయమని భావించి మహాతపోధనులైన శిష్యులను తోడిచ్చి భర్త వద్దకు పంపెను. శకుంతల తన కుమారుని తీసుకొని మంత్రులు, సామంతులు, పురోహితులు, పురప్రముఖులతో నిండియున్న దుష్యంతుని కొలువులో ప్రవేశించెను. కాని పూర్వం కణ్వమహర్షి ఆశ్రమంలో తాను పొందిన ప్రేమానురాగములు గాని, ఉత్సాహముగాని దుష్యంతునిలో కనిపించలేదు.

అంత శకుంతల "ఎక్కువ కాలమగుట వలన నన్ను మరచిపోయేనా? లేక తెలిసియు తెలియనట్లు నటించుచున్నాడా?" అని తన మదిలో తలచెను. "నిజముగా మరచిపోయినచో జ్ఞప్తికి వచ్చునట్లు చేయవచ్చును. అసలే తెలియకపోయినచో అనేకవిధములుగా ప్రయత్నించి తెలియజెప్పవచ్చును. కాని ఎరిగియు ఎరుగనట్లు నటించు మోసగానికి తెలుపుట సృష్టికర్తయైన బ్రహ్మదేవునికైన సాధ్యము కాదు. అయినను రాజ సభకు వచ్చిఊరక తిరిగివెళ్ళరాదు. నా పూర్వ వృత్తాంతమంతయు తెలిపి, నా కుమారుని చూపింతు" నని నిశ్చయించుకొని శకుంతల దుష్యంతునితో ఇట్లు పలికెను.

"ఓ రాజా! బాలసూర్యుని తేజస్సుతో ప్రకాశించు ఈ బాలుడు నీ కుమారుడు. పౌరవ వంశమునకు అలంకారము వంటి వీనిని యువరాజుగా పట్టాభిషిక్తుని జేయుము".

శకుంతల మాటలు విని దుష్యంతుడు " ఓ కాంతా! నీవెవరివో నాకు తెలియదు. అనుచితమైన మాటలు పలుకకుండా నీవు వచ్చిన చోటికే తిరిగి పొమ్ము" అని పలికెను. దుష్యంతుని మాటలకు శకుంతల నిశ్చేష్టురాలై, కోపారుణిత నేత్రముల నుండి కన్నీటి బిందువులు జారి పడుచుండగా, హృదయమునందలి దు:ఖమును అణచుకొనుచు, తల ప్రక్కకు వంచి ఓరచూపులు చూచుచు, దుష్యంతునితో ఇట్లు పలికెను.

రాజా! బాగుగా తెలిసియుండియు, ఏమియు నెరుగని వానివలె ఎందులకు పలికెదవు? నేనే కాని ఇచ్చటనున్న వారెవరికి తెలియదు గదా యని నీవంటి ధర్మాత్ములు అసత్యములు పలుకుట తగునా? విమల యశోనిధీ! వేదములు, పంచభూతములు, ధర్మువు, ఉభయసంధ్యలు, యమధర్మరాజు, చంద్రసూర్యులును మానవుని ప్రవర్తనను గమనించుచునే యుండును. ఈ మహాపదార్థములుండగా మనుష్యుడు ఎవరిని వంచింపలేడు. కావున నీవు నాకిచ్చిన వరముల సంగతి జ్ఞప్తికి తెచ్చుకొని నాయందు పూర్వము వలెనే దయజూపుము. పతివ్రతయు, గుణవతియు, సంతానవతియు, అనుకూలవతియునైన భార్యను అవమానించువానికి ఇహ, పరములుండవు. అనుకూలవతియైన భార్య గలవాడు ఉత్తమ గృహస్థుని ఫలమును సంపూర్ణముగా పొందగలడు. భార్యయే ధర్మార్థకామము అను పురుషార్థములను సంపాదించుటకు సాధనము. గృహ నిర్వహణ విద్యకు స్థానము. నిర్మలమైన నడవడిని బబోధించుటలో గురువు .



Scanned with CamScanner

భర్తయొక్క నందమునకు భార్యయే మూలము. భార్య తప్ప భర్తకు మరే వస్తువులును ప్రియమైనవి లేవు. అంతే కాదు. భర్త భార్యయందు ప్రవేశించి ఆమె గర్భమునందు పుత్రుడై తానే తిరిగి జన్మించును. కావున తండ్రి బిడ్డలకు భేదము లేదు.

ఓ రాజా వినుము. గార్హపత్యమనెడి అగ్నియే వేరుచేయబడి ఆహవనీయమనెడి అగ్నిగా ప్రకాశించునట్లే తండ్రియే కుమారుని రూపములో తన తేజస్సు తోడనే ప్రకాశించును. తాను తన నీడను నీటిలో చూచుకొన్నట్లుగా తండ్రి తన ప్రతిబింబమైన కుమారుని చూచి మహానందమును పొందును. "పున్నామ నరకము నుండి రక్షించువాడు' కావున

పుత్రుడయ్యెను. పుత్రుడు ఉభయ వంశములను ఉద్ధరించును. ఒక దీపము నుండి మరియొక దీపము పుట్టినట్లుగా, నీ పవిత్ర శరీరము నుండియే ఈ కుమారుడు పుట్టి మిక్కిలి కాంతితో ప్రకాశించుచున్నాడు. ఓ రాజా! ఈ కుమారుని కౌగిలించుకొని పుత్రగాత్ర పరిష్వంగ సుఖమును పొందుము. ముత్యాలహారములు గాని, చందనముగాని, వెన్నెల గాని పుత్రగాత్ర పరిష్వంగము వలె మనోహరమైనవి కావు. నీ కుమారుడు నూరు యాగములు చేసి వంశవర్ధనుడై విరాజిల్లునని సరస్వతీదేవి మునులందరు వినునట్లుగా చెప్పినది. – ఇట్లు శకుంతల దుష్యంతునకు తండ్రికి, కుమారునకు గల అనుబంధము ఎంత పవిత్రమైనదో వివరించినది. ఇట్లు కుటుంబ పవిత్రనుబంధానికి ఈ పాఠ్యాంశం తార్కాణంగా నిలుస్తుంది.

తరువాత శకుంతల సత్య ప్రాశస్త్యమును గురించి దుష్యంతునకు ఇట్లు తెలిపెను.

సూనృత వ్రతా! నూడు చేదుడుబావుల కన్న ఒక దిగుడుబావి మేలు. నూరు దిగుడు బావుల కన్న ఒక చక్కని క్రతువు మిన్న. నూరు యజ్ఞముల కన్న ఒక కుమారుడు మేలు. అట్టి నూరుగురు పుత్రుల కన్న ఒక సత్యము శ్రేష్ఠమైనది. వేయి అశ్వమేధముల కంటే ఒక్క సత్యమే గొప్పది. సమస్త తీర్థాటనము, సమస్త వేదాధ్యయనము సత్యముతో సమానములు కావు. కావున కణ్వాశ్రమమునందు చేసిన ప్రతిజ్ఞలను మన్నింపుము. క్షత్రియ శ్రేష్ఠుడైన విశ్వామిత్రునకు, ఉత్తమురాలయిన మేనకకు పుట్టిన నేను అసత్యమును మాట్లాడు అధర్మపరురాలను కాదు." అంటూ సత్యవాక్కు యొక్క గొప్పతనాన్ని తెలియచేసింది.

శకుంతల మాటలను అంగీకరించని దుష్యంతుడు "నీవెక్కడ? నేనెక్కడ? ఈ సుతుడెక్కడ? నేను ఇంతకుపూర్వము మిమ్ములనను చూచియుండలేదు. స్త్రీలు అసత్యములు మాట్లాడుదురనుమాట నిజమగునట్లు అబద్ధములాడుట తగదు. రూపమునందును, వయస్సునందును, పరాక్రమమునందును సాటిలేనివాడైన ఈ బాలుడు నీ కొడుకన్నచో విన్నవారందరూ నవ్విపోవుదురు. లోకవిరుద్ధములైన మాటలకు మేము జంకుదుము." అని పలికెను.

అంత శకుంతల మిక్కిలి దు:ఖించుచు, "పుట్టినప్పుడు తల్లిదండ్రుల చేతనే విడువబడితిని. ఇప్పుడు భర్త చేతను విడిచిపెట్ట బడుతున్నాను కాబోలు! పూర్వజన్మమున నేను నోచిన నోములిట్టివి" అని ఆశ నశింపగా, "ఇక భగవంతుడొక్కడే తనకు దిక్కని" కుమారుని తీసుకొని వెనుదిరిగి వెళ్ళనుండగా, దివ్యవాణి యిట్లు పలికెను.

" ఈ బాలుడు నీకును శకుంతలకును పుట్టిన కుమారుడే. సాధ్వి, పతివ్రత యగు శకుంతల నిజమే పలికింది. వీనిని స్వీకరించి మన్నింపుము". శకుంతల పాతివ్రత్యమును, సత్యనిష్ఠను, భరతుని జన్మమును ప్రశంసించుచు సభలోని వారందరు ఆశ్చర్యమొందునట్లు ఆకాశవాణి పలుకగా – దుష్యంతుడు "నేను ఈమెను కణ్వాశ్రమమునందు గాంధర్వ విధిని వివాహమాడితిని. ఈ విషయము మా యిరువురకే తెలియును. ఇతరులెవరును ఎరుగరు. లోకాపవాద భీతిచే ఈమెను నేనెరుగనని పలికితిని – అందరు వినునట్లుగా దివ్యవాణి సత్యమును తెలిపెను" అని పలికి, మిక్కిలి ప్రేమతో కుమారుని కౌగిలించుకొనెను. శకుంతలాదేవిని గౌరవముతో ఆదరించెను. అనంతరము భరతుని యౌవరాజ్యమునకు పట్టాభిషక్తుని గావించి, చాలాకాలము రాజ్యసుఖములు అనుభవించెను. రాజ్య భారమంతయు కుమారుని కప్పగించి, దుష్యంతుడు తపోవనమునకు వెళ్ళెను.



Scanned with CamScanner